సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 29 । జూలై । 2024



విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

జిల్లాలో ఆదివారం వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందారు. మృతుల్లో ఒక రైతు, చికెన్ సెంటర్ నిర్వాహకుడు ఉన్నారు. 8లో



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.17, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.1°/23.4°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 10 నుంచి 18 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



ఉమామహేశ్వ రెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉమామహేశ్వరరెడ్డి (34) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సంకేపల్లికి చెందిన నారాయణరెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమారుడు ఉమామహేశ్వర్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం కింద ఇంటి వద్ద నుంచే విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం రాత్రి పనిమీద స్కూటీపై ముదిగుబ్బకు బయల్దేరాడు. కేజీబీవీ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అయితే కాగా మార్గమధ్యంలోనే ఉమమామహేశ్వరరెడ్డి మృతి చెందాడు.

పీఏబీఆర్, జీబీసీకి నీటి మళ్లింపు



మోపిడి లింక్ ఛానల్ నుంచి పీఏబీఆర్‌కు వెళ్తున్న జలాలు

ఉరవకొండ: మండలంలోని మోపిడి గ్రామం వద్ద గల లింక్ ఛానల్ నుంచి పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు 400 క్యూసెక్కుల నీటిని హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నీటిని మొదటి ప్రాధాన్యతగా పీఏబీఆర్‌కు మళ్లించామని, ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి అవసరాల దృష్ట్యా డ్యాంను పూర్తిగా నింపడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని రోజుల తరువాత మిడ్ పెన్నార్ డ్యాం (ఎంపీఆర్)కు నీటిని విడుదల చేస్తామన్నారు.

- మండల పరిధిలోని నింబగల్లు హెడ్ రెగ్యులేటరీ వద్ద ఉన్న గుంతకల్లు బ్రాంచ్ కాలువ (జీబీసీ)కు కూడా తుంగభద్ర జలాలను ఆదివారం అధికారులు విడుదల చేశారు. 120 క్యూసెక్కుల మేర నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే విడుదల చేశారు.

జిల్లాలో పోలీసింగ్ దారి తప్పుతోంది. దొంగలు దొరికిన కాడికి దోచుకుపోతున్నారు. ఎప్పుడు, ఎవరి ఇంట్లో చోరీ జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీస్ స్టేషన్ల సమీపంలోనే రెక్కీ నిర్వహించి వరుసగా చోరీలు చేస్తుండటం గమనార్హం. ప్రజల భద్రత గాలిలో దీపంలా మారింది.

- బదిలీ బిజీలో పోలీసులు
- జిల్లాలో వరుస దొంగతనాలు
- రాజ్యమేలుతున్న అక్రమార్కులు
- సరిహద్దు దాటుతోన్న రేషన్ బియ్యం
- యథేచ్ఛగా కర్ణాటక మద్యం అక్రమ రవాణా
- పక్క రాష్ట్రాలకు రాత్రిపూట తరలిపోతున్న ఇసుక
- అడపాదడపా దాడులతో సరిపెడుతున్న పోలీసులు



నిఘాపై నిర్లక్ష్యం

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పోలీసు శాఖలో ఉద్యోగులందరూ బదిలీ బిజీలో ఉండటంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు జూదం, మరో వైపు కర్ణాటక మద్యం, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతున్నాయి. గ్రామస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు నేరాలకు అదుపు లేకుండా పోయింది. సామాన్య మానవుడి ఇల్లు మొదలు కలెక్టర్ బంగ్లా వరకు దొంగతనం చేసేందుకు ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోంది. చాలా స్టేషన్లలో అధికారులు సెలవులో ఉండటంతో అక్కడ ఉన్న సిబ్బంది మాట దాట వేస్తున్నారు. ఎలాగూ బదిలీపై వెళ్తున్నాం కదా అని పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా దొంగలు, జూదరులు, అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గత నెల రోజుల నుంచి నేరాల సంఖ్య విపరీతంగా పెరిగినట్లు తెలుస్తోంది.

కనిపించని విజిబుల్ పోలీసింగ్

పోలీసులు నిరంతరం ప్రజల్లో కనిపించాలి. స్టేషన్లకే పరిమితం కావద్దని ఉన్నతాధికారులు సూచిస్తున్నా తీరు మారలేదు. క్షేత్రస్థాయిలో చాలామంది పోలీసులు స్టేషన్లకే పరిమితం అవుతున్నారు. అడపాదడపా దాడులతో ఒకటో రెండో కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారు. పోలీసు నిఘా లోపాన్ని గమనించిన అక్రమార్కులు రాత్రింబవళ్లు బీభత్సం సృష్టిస్తున్నారు.

ఏదీ వదలకుండా..

అక్రమార్కుల కంట పడితే ఏదీ వదలని పరిస్థితి నెలకొంది. ఏటీఎంలు పగులగొడుతున్నారు. బ్యాంకు సర్వీస్ పాయింట్లలో చోరీ చేస్తున్నారు. అధికారుల ఇంట్లో చొరబడుతున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. ఆలయాల్లో హుండీలను ఎత్తుకెళ్తున్నారు. వంకలు, వాగుల నుంచి ఇసుకను అక్రమంగా రాత్రివేళల్లో తరలిస్తున్నారు. పశువులను కబేళాలకు పంపిస్తున్నారు. కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారు. దర్జాగా రేషన్ బియ్యం సరిహద్దు దాటిస్తున్నారు. ఎర్రచందనం దుంగలు రవాణా చేస్తున్నారు. నిషేధిత గంజాయి, గుట్కా అక్రమ రవాణా ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం సంపాదిస్తున్నారు.

ఉపేక్షించేది లేదు



శాంతిభద్రతలకు విఘాతం కలిగితే సహించేది లేదు. అక్రమార్కులను ఉపేక్షించేది లేదు. చట్టానికి ఎవరూ అతీతులు కారు. చోరీలు, గ్యాంబ్లింగ్, ఇసుక, రేషన్ బియ్యం, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపి.. ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నాం. దొంగతనాలకు సంబంధించి అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నాం. నేరం రుజువు కాగానే బాధితులకు సొమ్ము, సొత్తు అందజేస్తాం. పోలీసులపై నమ్మకం కలిగించే విధంగా ఉండాలని సిబ్బందికి సూచించాం.

– వి.రత్న, ఎస్పీ

ఇటీవల వెలుగు చూసిన ఘటనలు మచ్చుకు కొన్ని..



రొద్దం మండలంలో ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు (ఫైల్)



హిందూపురంలో ఎస్‌బీఐ సేవా కేంద్రంలో చోరీ జరిగిన దృశ్యం (ఫైల్)

- కలెక్టర్ బంగ్లాలో ఫిబ్రవరి మొదటి వారంలో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటికీ నేరస్తులు ఎవరో తేలలేదు. మూడు రోజుల క్రితం బుక్కపట్నంలో దొంగలు దొరికారని పోలీసులు చెప్పారు. కానీ వారు ఏ కేసులకు సంబంధించిన వారో ఇంకా వెల్లడించలేదు.
- హిందూపురం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తన వాహనం ఎన్ని రోజులకీ ఇవ్వలేదని ఓ వ్యక్తి పలుమార్లు స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. అయితే ఆ తర్వాత అతడి వాహనం బయట రోడ్డుపై మరో వ్యక్తి వద్ద కనిపించడం అనుమానాలకు దారి తీస్తోంది.
- జూన్ 19న అనంతపురం నుంచి 40 బస్తాల రేషన్ బియ్యంతో ఓ వాహనం బయలుదేరి జాతీయ రహదారి మీదుగా కర్ణాటక చేరింది. ఆయా స్టేషన్లకు పక్కా సమాచారం ఇచ్చినా దృష్టి సారించలేకపోయారని ఓ వ్యక్తి తెలిపాడు.
- ఈ నెల 25న కనగానపల్లి మండలం దాదులూరులో పట్టపగలే చోరీ జరిగింది. వెంకటాద్రి ఇంట్లోకి దుండగులు ప్రవేశించి 30 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ నెల 26న కనగానపల్లి మండలం రాంపురం గ్రామంలో కురుబ గోపాల్ ఇంట్లోకి దుండగులు ప్రవేశించి రూ.50 వేల నగదు దొంగలించారు.
- ఈ నెల 25న రాత్రి హిందూపురంలో ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్‌లోకి దొంగలు చొరబడి నగదుతో ఉడాయించారు.
- ఈ నెల 26న పెనుకొండ సమీపాన మారెమ్మ ఆలయంలో చోరీ జరిగింది.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు మంత్రి సవిత ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి సవిత

పుట్టపర్తి అర్బన్: మడకశిర నియోజకవర్గంలో ఆగస్టు ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, పుట్టపర్తి, మడకశిర, కదిరి ఎమ్మెల్యేలు సింధూరరెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. సీఎం హోదాలో తొలిసారి జిల్లాలో పర్యటించనున్నారని, గుండుమలలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేయనున్నారని మంత్రి తెలిపారు. పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మడకశిరలో ఉన్న అతిథి గృహాలను రెండు రోజుల్లో అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోటుపాట్లు రానీయొద్దు

సీఎం పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లు రాకుండా చూడాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఒకటో తేదీన గుండుమల గ్రామంలో ప్రజా వేదిక, లబ్ధిదారులతో ముఖాముఖి, సామాజికభద్రత పింఛన్ల పంపిణీలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. పర్యటన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టరేట్‌లోని 'మీ కోసం' సమావేశ మందిరంలో ఎస్పీ రత్న, డీఆర్వో కొండయ్యతో పాటు అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, హెలిప్యాడ్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, బయో టాయిలెట్లు, అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్, వైద్య ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డ్వామా పీడీ విజయప్రసాద్, పరిశ్రమల జీఎం చాంద్‌బాష, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ వెంకటరమణారెడ్డి, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, తదితర అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది





టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వారికి వైఎస్సార్‌సీపీ తరఫున చెక్కులు అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, కదిరి సమన్వయకర్త మక్బూల్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, సమన్వయకర్త మక్బూల్

కదిరి టౌన్: కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, కావలసిన సహాయ సహకారాలు అందిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. ఇది పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటగా చెబుతున్నామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఆదివారం కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు, ఆస్తుల విధ్వంసాలకు పాల్పడటం బాధాకరమన్నారు. టీడీపీ దాడులపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ వారు కదిరికి చెందిన వైఎస్సార్‌సీపీ సత్యసాయి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మెగా అంజాద్, తలుపుల మండలం పెద్దవారిపల్లి మాజీ సర్పంచ్ చెన్నకృష్ణారెడ్డి దాడి చేశారు. దాడిలో గాయపడిన ఇద్దరికి పార్టీ అధినేత వైఎస్ జగన్ తరఫున ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులను జిల్లా అధ్యక్షుడు, సమన్వయకర్త అందజేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పసికందు కిడ్నాప్



పసికందును తీసుకొస్తున్న డీఎస్పీ టీవీవీ ప్రతాప్, టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్

- మూడు గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు

అనంతపురం: ఆరు రోజుల పసికందును అపహరించిన ఘటనను పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించారు. పసిబిడ్డను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన అమృత ఈ నెల 16వ తేదీన అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో కాన్పు నిమిత్తం చేరింది. ఈ నెల 23న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి తల్లీబిడ్డ ఆసుపత్రి గైనిక్ విభాగంలో వైద్య సేవలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు పసికందు అదృశ్యమైనట్లు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించారు. వెంటనే కేసు ఛేదించాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, టూటౌన్ సీఐ క్రాంతికిరణ్, నాల్గవ పట్టణ సీఐ ఆర్. ప్రతాప్ రెడ్డి, అవుట్‌పోస్టు ఎస్ఐ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డును దిగ్బంధనం చేసి అనుమానితులపై విచారణ చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. కురుకుంటకు చెందిన ఆమని అనే మహిళ పసికందును అపహరించినట్లు గుర్తించారు. ఆమె నుంచి పసికందును తీసుకుని తల్లిదండ్రులైన అమృత, అనిల్ కుమార్‌లకు డీఎస్పీ నేతృత్వంలో అప్పగించారు.

సాయం చేయడానికి వచ్చి..

నిందితురాలు ఆమని గైనిక్ వార్డులోకి మూడు రోజుల క్రితం వచ్చింది. అమృత బెడ్డు పక్కనే ఉన్న మరో రోగికి సపర్యలు చేసేది. ఆమెతో బంధుత్వం లేకపోయినప్పటికీ, ప్రతి రోజూ భోజనం తెచ్చి పెట్టి వెళ్లేది. ఈ క్రమంలో అమృత కుమార్తెపై మమకారం పుట్టింది. ఆమనికి ఇద్దరూ కొడుకులే కావడంతో కుమార్తె ఉండాలని భావించి పసికందును అపహరించింది.

సీసీ కెమెరాల్లో కదలికలను పసిగట్టి..

గైనిక్ వార్డుల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. వార్డులోకి వచ్చిన వారు, వెళ్లిన వారి కదలికలను ఆరా తీశారు. నిందితురాలు ఆమని పదేపదే తిరుగుతూ కనిపించింది. దీంతో హాస్పిటల్లోనే ఉన్న ఆమనిని పోలీసులు ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆమెకు తెలియకుండా ఒక కానిస్టేబుల్‌ను ఇంటికి పంపించారు. ఇంట్లో పసికందు ఉండడంతో తీసుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తెల్లవారుజామున 4.30 గంటలకు ప్లాస్టిక్ బుట్టలో పాపను పెట్టుకుని అపహరించింది. ఆమనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

జిల్లా ఎస్పీ ప్రశంస

పసికందు అదృశ్యం ఘటనను కేవలం మూడు గంటల్లోనే ఛేదించి తల్లిదండ్రుల వేదనను తీర్చిన అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, టూటౌన్ సీఐ క్రాంతికుమార్, నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్ రెడ్డి, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.





సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న హిమాచల్ ప్రదేశ్ బాలవికాస్ చిన్నారులు

సాయి సన్నిధిలో హిమాచల్ సాంస్కృతిక వైభవం

ప్రశాంతి నిలయం: సత్యసాయి సన్నిధిలో హిమాచల్ ప్రదేశ్ భక్తులు తమ సాంస్కృతిక వైభవాన్ని చాటారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ సత్యసాయి భక్తులు ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో మహాసమాధి చెంత వారి సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. సాయంత్రం 'హృదయార్పణ' పేరుతో హిమాచల్ ప్రదేశ్ సత్యసాయి యూత్ సంగీత విభావరి నిర్వహించారు. భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.4,11,700 స్వాధీనం
- 10 మంది అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు చూపుతున్న పోలీసులు

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె సమీపంలో వ్యవసాయ తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో గార్లదిన్నె, శింగనమల పోలీసులు దాడులు చేశారు. ఇందులో భాగంగానే 10 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4,11,700 నగదు, 20 ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో శింగనమల ఎస్‌ఐ చంద్రశేఖర్, గార్లదిన్నె ఏఎస్‌ఐ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

400 టీఎంసీల సాధనతోనే రాయలసీమ సస్యశ్యామలం



సదస్సులో మాట్లాడుతున్న దశరాథరామిరెడ్డి

అనంతపురం సెంట్రల్: రాయలసీమ జిల్లాలకు 400 టీఎంసీల నికరజలాలు సాధించడం ద్వారా సీమ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని రాయలసీమ సాగునీటి సంఘం అధ్యక్షుడు దశరాథరామిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం మార్కెట్‌యార్డు సమీపంలో భారత్ ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమకు సాగు, తాగునీరు ఇవ్వడానికి సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు నిర్మాణంతో పాటు తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి సమాంతర కాలువ నిర్మాణం జరగాలన్నారు. కృష్ణా రివర్ మేనేజ్మెంట్‌బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని, శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు నీళ్లు, నిధులు, రాజధాని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ అభివృద్ధిని గాలికొదిలేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఐటీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, రైతు సంఘం నాయకులు హనుమన్న, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం



అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం



శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు బీసీ స్టడీ సర్కిల్ వరంగా మారింది. ప్రతి నెలా స్టైఫండ్ ఇవ్వడంతో పాటు స్టడీ మెటీరియల్ కూడా ఇస్తుండటంతో వారికి ఎంతో ఊరట కలుగుతోంది. వేల రూపాయలు ప్రైవేటు కోచింగ్‌లకు చెల్లించే పనిలేకుండా ఉచితంగా శిక్షణ దొరుకుతోందని అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ
- ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కో బ్యాచ్‌లో 200 మందికి అవకాశం
- గ్రూప్ 1, 2 తో పాటు పలు ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధం
- నెలకు రూ.1500 స్టైఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్

అనంతపురం రూరల్: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే వేలకు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎస్‌ఐ, గ్రూప్ 1, 2, సచివాలయ, రైల్వే, బ్యాంకింగ్ ఉద్యోగాలతో పాటు వివిధ పోటీ పరీక్షలకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాల్లో ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయించారు. అయితే గత ఐదేళ్లలో బీసీ స్టడీ సర్కిళ్లలో మౌలిక వసతులు కల్పించి నిష్ణాతులైన ట్యూటర్లతో శిక్షణ ఇప్పించడంతో ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

శిక్షణతో పాటు స్టైఫండ్..

పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి ప్రతి బ్యాచ్‌కు అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నారు. వీరిలో 66 శాతం సీట్లు బీసీలకు, 20 శాతం సీట్లు ఎస్సీలకు, 14 శాతం సీట్లు ఎస్టీలకు కేటాయిస్తున్నారు. శిక్షణకు ఎంపికయ్యే అభ్యర్థులకు రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో ఉచితంగా మెటీరియల్, నెలకు రూ. 1500 చొప్పున రెండు నెలల పాటు స్టైఫండ్ అందిస్తుండటంతో శిక్షణ పొందటానికి దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి అందించిన ప్రోత్సాహాన్ని కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అందిస్తుందా? లేదా అన్నది మాత్రం వేచి చూడాలి.

అన్ని వసతులు కల్పించారు



ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ సరైన ఉద్యోగాలు లభించక చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్న నాలాంటి వారికి ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తం. రెండు నెలల నుంచి గ్రూప్–2 పరీక్షలకు శిక్షణ పొందుతున్నా. స్టడీ సర్కిల్ కార్యాలయంలో మాకు అన్ని వసతులు కల్పించారు. స్టడీ మెటీరియల్, స్టైఫండ్ అందిస్తుండటంతో పోటీ పరీక్షలకు అన్ని విధాలా సన్నద్ధమయ్యాను.

– చిరంజీవి, కళ్యాణదుర్గం

ప్రైవేటుగా ఫీజు చెల్లించలేం



ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో గ్రూప్–2 కోచింగ్ తీసుకోవాలంటే వేల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి. వేలకు వేలు చెల్లించి కోచింగ్ తీసుకోవాలంటే పేద, మధ్యతరగతి నిరుద్యోగ యువతకు సాధ్యం కాదు. బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తుండడంతో పేద నిరుద్యోగ యవత ఉద్యోగాలు సాధించుకోగలుగుతున్నారు.

– అపర్ణ, అనంతపురం

అన్ని ఏర్పాట్లు చేశాం



పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. శిక్షణ పొందే వారికి మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నాం. అలాగే రెండు నెలల పాటు నెలకు రూ.1500 చొప్పున స్టైఫండ్ కూడా ఇస్తున్నాం.

– కుష్బూకొఠారి, ఉప సంచాలకులు, బీసీ స్టడీ సర్కిల్

ఇరు వర్గాల ఘర్షణ



గాయపడిన వెంకటసుబ్బు

తనకల్లు: మండల పరిధిలోని ముండ్లవారిపల్లిలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో వెంకటసుబ్బు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... ముండ్లవారిపల్లికి చెందిన శ్రీకాంత్, వెంకటరమణ, వెంకటనారాయణ, నాయనచెరువుపల్లికి చెందిన నాగరాజుకు సీజీ ప్రాజెక్టు వద్ద కొందరితో కొంతకాలంగా భూ వివాదం ఉంది. భూసమస్య తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉండటానికి వెంకటసుబ్బు కుమారుడు వెంకటేషే కారణమని వారు అనుమానం పెంచుకున్నారు. ఆదివారం ఉదయం శ్రీకాంత్, వెంకటరమణ, వెంకటనారాయణ, నాగరాజు కలిసి వెంకటసుబ్బు ఇంటిపైకి దాడికి వెళ్లారు. ఆ సమయంలో వెంకటేష్ ఇంట్లో లేడు. వెంకటసుబ్బు, అతని మనువడు నగేష్ ఉండటంతో వారిపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో వెంకటసుబ్బు తలకు, చేతికి బలమైన గాయాలు కాగా నగేష్‌కు భుజాలకు గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను చికిత్స కోసం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే వెంకటసుబ్బు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచనతో మెరుగైన చికిత్స కోసం అనంతపురంకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ధరణిబాబు ఆస్పత్రికి చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన చెస్ పోటీలు

అనంతపురం: ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అండర్–7 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీలు ముగిశాయి. అండర్–07 ఓపెన్ విభాగంలో ఈశ్వర ప్రసాద్ 4/4 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. అండర్–07 బాలికల విభాగంలో కాశి సమిక 3/3 పాయింట్లతో విజేతగా నిలిచింది. విజేతలకు బహుమతులను టోర్నమెంట్ డైరెక్టర్ కిషోర్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున, నేషనల్ ఆర్బిటర్ కమల్ అందజేశారు. విజయనగరంలో ఆగష్టు 3,4 తేదీల్లో జరిగే ఏపీ రాష్ట్ర అండర్–07 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో వారు పాల్గొంటారని ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడు తెలిపారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

- రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్



మాట్లాడుతున్న ఆర్‌యూపీపీ రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) రాష్ట్ర సహాధ్యక్షుడు సి.ఎర్రిస్వామి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.హనుమేష్, జి.తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలో ఆర్‌యూపీపీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎర్రిస్వామి, హనుమేష్, తులసిరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రంగా మొట్టమొదటగా ఏర్పడిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఇంతటి కీర్తి సంపాదించుకున్న తెలుగు రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు మాధ్యమం బోధన లేకపోవడం విచాకరమన్నారు. కేవలం ఆంగ్ల మాధ్యమం అనేది కాకుండా సమాంతరంగా తెలుగు మాధ్యమం కూడా అమలు చేయాలన్నారు. తెలుగు బోధించే కొందరు టీచర్లు డీఈఓ పూల్‌లో ఉంటూ ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌యూపీపీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవిందు, నాయకులు ధర్మపురి వెంకటేశ్, గోపాల్, నవీన్‌కుమార్, వెంకటరమణారెడ్డి, ధనుంజయ, రవికుమార్ పాల్గొన్నారు.

సర్వజనాస్పత్రి గాడిలో పడేనా?!

- సమయపాలన పాటించని వైద్యులు
- సూపర్ స్పెషాలిటీ నిర్వహణలో లోపాలు
- నేడు జీజీహెచ్‌కు మంత్రి సత్యకుమార్



అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు (ఫైల్)

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి పాలన గాడి తప్పింది. వైద్యులు సమయపాలన పాటించకపోవడం పెద్ద సమస్యగా మారింది. జీజీహెచ్‌కు అనుసంధానంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలో మంత్రి సత్యకుమార్ సర్వజనాస్పత్రిని సోమవారం పరిశీలించనున్నారు. వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి స్పందించి ఆస్పత్రి పాలనను గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎంసీహెచ్ బ్లాక్ అనివార్యం..

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు సర్వజనాస్పత్రి పెద్దదిక్కు. రోజూ 2,500 మంది ఓపీ, అడ్మిషన్‌లో 1,100 మంది ఉంటారు. అందులో గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో సేవలు పొందుతుంటారు. రోజూ 20 నుంచి 30 ప్రసవాలు జరుగుతుంటాయి. గైనిక్ విభాగంలోని నాలుగు యూనిట్లలో 120 పడకలు మంజూరైనా.. ప్రస్తుతం 220 మందికి సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో స్థలం చాలక ఆస్పత్రి ఆవరణంలో ఆసోకర్యాల మధ్య షెడ్డులో ఉంచుతున్నారు. దీంతో మదర్ హెల్త్ చైల్డ్ బ్లాక్ (ఎంసీహెచ్ బ్లాక్) ఏర్పాటు అనివార్యమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆస్పత్రికి నాడు–నేడు పథకం కింద రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్, వైద్యుల హాస్టల్ మంజూరైంది. ఎంసీహెచ్ బ్లాక్ పూర్తి కాగా, మిగిలిన భవనాల నిర్మాణం జరుగుతోంది. వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఖాళీ చేయాల్సి ఉంది. మంత్రి స్పందించి ఆ ప్రాంతంలో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేస్తే బాలింతలకు మరింత మెరుగైన వైద్యం అందుతుంది.

ఎమర్జెన్సీని విస్తరించాల్సిందే..

సర్వజనాస్పత్రిలో ఎమర్జెన్సీ విభాగాన్ని విస్తరించాల్సి ఉంది. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఉంటున్నారు. ఆ తరువాత సీఎంఓలదే బాధ్యత. వైద్యులు బాధ్యతా రాహిత్యంతో వ్యవహరిస్తూ పీజీలపై భారం వేసి పత్తా లేకుండా పోతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య వెంటాడుతోంది. తరచూ వైద్యులు, సిబ్బంది, రోగుల సహాయకుల వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఈఎన్‌టీ వార్డు పక్కన ఉన్న స్థలంలో డిజిటల్ బ్లాక్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జీజీహెచ్‌లో భాగమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా మారింది. ఆస్పత్రిలో మధ్యాహ్నం నుంచి వైద్యులు కనిపించడం లేదు. ఈ విషయాలన్నింటిపై మంత్రి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి



భార్య, ముగ్గురు కుమార్తెలతో ఆదిశేషు (ఫైల్)

చిలమత్తూరు: మండలంలోని వైగొల్లపల్లికి చెందిన రైతు బడన్నగారి నరసింహప్ప (48) శనివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వ్యవసాయ మోటారుకు సంబంధించిన స్టార్టర్ ఫ్యూజ్‌లు చెడిపోయాయి. మరమ్మతు చేసే క్రమం ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పుట్టపర్తిలో...

పుట్టపర్తి అర్బన్: విద్యుదాఘాతంతో చికెన్ సెంటర్ నిర్వాహకుడు మృతి చెందిన సంఘటన పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువులో చోటు చేసుకుంది. మండలంలోని చెర్లోపల్లికి చెందిన ఆదిశేషు (41) సమీప గ్రామమైన వెంగళమ్మచెరువులో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం బ్రాయిలర్ కోళ్ల శుభ్రం చేసే మిషన్‌ను శుభ్రం చేస్తున్నాడు. మిషన్‌కు విద్యుత్ సరఫరా అవుతున్న విషయాన్ని గమనించకపోవడంతో విద్యుదాఘాతంతో అక్కడక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి పుట్టపర్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ కృష్ణమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పిల్లలను పోషించేది ఎలా అంటూ భార్య బిగ్గరగా రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడదాం

- ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సుధీర్



జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న సుధీర్

మడకశిర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేయాలని ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సుధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏఐయూటీయూసి జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ఈ సభకు జిల్లా కార్యదర్శి అశోక్ అధ్యక్షత వహించారు. అంతకు ముందు పట్టణంలో వివిధ విభాగాలు, శాఖల్లో పని చేస్తున్న కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన ప్రథమ మహాసభలో సుధీర్ మాట్లాడుతూ సమస్యల సాధనకు ఐక్య పోరాటమే కార్మికులు, కర్షకులకు శరణ్యమని తెలిపారు. పోరాటం చేసి తమ హక్కులను సాధించుకోవాలని కోరారు. జిల్లాలో లక్షలాది మంది కార్మికులు ఉన్నారని తెలిపారు. అయితే ఈఎస్‌ఐ ఆస్పత్రి లేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపును వెంటనే ఆపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మికులు, కర్షకుల వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. అనంతరం మహాసభలో కార్మికుల సమస్యలపై తీర్మానాలు పెట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి, ఎస్‌యూసీఐ(సీ) ప్రతినిధి గిరీష్ తదితరులు ప్రసంగించారు.

కీలక అధికారి లేని సమగ్ర శిక్ష



సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం

- ఈ నెల 22న రిలీవ్ అయిన వైఖోం నిదియాదేవి
- అప్పటి నుంచి ఎవరినీ నియమించని ప్రభుత్వం
- ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు డీఈఓ ససేమిరా
- కొరవడిన విద్యాభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యా వ్యవస్థలో సమగ్ర శిక్ష అత్యంత కీలకమైన ప్రాజెక్ట్. ప్రతి విద్యాభివృద్ధి కార్యక్రమం ఈ ప్రాజెక్ట్ ద్వారానే అమలవుతోంది. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న కోట్లాది రూపాయల పనులను పర్యవేక్షించే బాధ్యత ఈ శాఖదే. అలాంటి శాఖకు జిల్లాస్థాయిలో ఉండే ముఖ్యమైన అధికారి అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) పోస్టు. ఇంతటి ప్రాధాన్యత కల్గిన పోస్టుకు జిల్లాలో దిక్కులేరు. గతంలో ఇన్‌చార్జ్‌గా ఉన్న వైఖోం నిదియాదేవి కడప జిల్లాకు బదిలీ కావడంతో ఈనెల 22న రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి ఏపీసీ పోస్టు ఖాళీగానే ఉంది. కీలక సమయంలో కనీసం ఎవరికీ బాధ్యతలు కూడా ఇవ్వలేదు. డీఈఓనే ఏపీసీ బాధ్యతలను తీసుకోవడం పరిపాటి. ప్రస్తుత డీఈఓ వరలక్ష్మి అదనపు బాధ్యతలు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. తనకు అనారోగ్యం, ఇతర ఇబ్బందులున్నాయంటూ ఉన్నతాధికారులకు విన్నవించారు. గతంలో ఏపీసీ వరప్రసాదరావు రిటైర్డ్ కావడంతో డీఈఓ వరలక్ష్మికే ఏపీసీ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పుడు కూడా ఆమె ఈ బాధ్యతలు తీసుకోకుండా కొర్రీ వేశారు. ఏడీ లేదా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌లో ఒకరికి ఇన్‌చార్జ్ ఇవ్వాలంటూ ఫైలు సిద్ధం చేసుకుని కలెక్టర్ వద్దకు వెళ్లగా ఆయన ఆ ఇద్దరినీ కాదని జెడ్పీ సీఈఓగా ఉన్న ఐఏఎస్ అధికారి నిదియాదేవికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కుంటు పడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు

సమగ్ర శిక్ష ఏపీసీగా ఎవరూ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి విద్యాభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. వివిధ ఫైళ్లు పెండింగ్ పడ్డాయి. నెల ముగుస్తుండడంతో ఉద్యోగుల జీతాల బిల్లులు పెట్టాల్సి ఉంది. దీనికితోడు విద్యా సీజన్ కావడంతో స్టూడెంట్ కిట్ల పంపిణీ, కేజీబీవీల్లో అడ్మిషన్లు, అకడమిక్ మానిటరింగ్, యూడైస్, నాడు–నేడు పనులను పర్యవేక్షించేవారు లేరు. సెక్టోరియల్ అధికారులు ఉన్నా వారిని సమన్వయం చేయాల్సిన అధికారి లేరు. వర్షాకాలం ప్రారంభం కావడంతో పాఠశాలల్లో అత్యవసరం ఏర్పడి చిన్నచిన్న గుంతలు పూడ్చాలంటే కూడా ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తెలీడం లేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. సెక్టోరియల్ అధికారులతో పాటు సమగ్ర శిక్ష ఉద్యోగులను కలిస్తే ఏపీసీ లేరు కదా? వచ్చిన తర్వాత కలిసి మాట్లాడండంటూ సలహా ఇస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికైనా అప్పగించాలంటూ ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, కేజీబీవీల ఎస్‌ఓలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు ప్రభాకర్

హిందూపురం టౌన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యల్లమ్మ దేవాలయం సమీపంలో ప్రభాకర్ (35) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలమేరకు... ప్రభాకర్ భార్య కుమార్తెతో కలిసి పుట్టిల్లు అయిన గౌరీబిదనూరుకు వారం క్రితం వెళ్లారు. ఇంట్లో ప్రభాకర్ ఒక్కడే ఉండేవాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు తెరిచిచూడగా ప్రభాకర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మద్యానికి బానిసైన ప్రభాకర్ మూడు రోజు క్రితమే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నివేద్



అనంతపురం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అనంతపురానికి చెందిన నివేద్ ఎంపికయ్యాడు. ఇటీవల విజయనగరంలో జరిగిన తైక్వాండో పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు పాల్గొంది. ఇందులో నివేద్ 39 కేజీల కేటగిరిలో ప్రతిభ ప్రదర్శించి గోల్డ్‌మెడల్ దక్కించుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకూ జాతీయస్థాయి పోటీలు జరుగుతాయి. నివేద్‌తో పాటు అతని కోచ్ శ్రీకాంత్‌రెడ్డిని జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. గురుస్వామి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కే. శాంతరాజ్ అభినందించారు.